క్లుప్తంగా

నాలుగు గ్రామాల్లో ఆధార్ నమోదు



సత్యవరం గ్రామంలో ఆధార్ నమోదు కార్యక్రమం

మాడుగుల : మండలంలో సత్యవరం, వొమ్మలి జగన్నాథపురం, సాగరం, పొంగలి పాక, గ్రామాల్లో శుక్రవారం ఆధార్ నమోదు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డులు తప్పులు దొర్లినా, కొత్త ఆధార్ నమోదుతో పాటు, విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్స్ తదితర సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కొంకి అప్పారావు నాలుగు ఆధార్ సర్వీస్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గొలుగొండ : ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారుశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మేజర్ పంచాయతీలో ఉన్నవీధుల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. వీధి కాలువలో పూడిక తొలగింపు కార్యక్రమంతో పాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు.

మాడుగుల రూరల్ : మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో ప్రధాన రహదారి, వీధుల్లో చెత్త చెదారాలు తొలగించారు. సర్పంచ్ జామి రమణబాబు పనులు పర్యవేక్షించారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలన



వైద్యసేవలపై సిబ్బందితో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

గొలుగొండ : నాగాపురం సెంటర్ పరిధిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ గ్రామ పరిధిలో ఎంతమంది ప్రజలు ఉన్నారు, సేవలు ఎలా అందుతున్నాయి అనే అంశాలను సేకరించారు. గర్భిణులు, కౌమార బాలికలు రక్త పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారో టాస్క్‌ఫోర్స్ అధికారి రామచంద్రరావు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డీపీవో జగదీష్ క్లోరినేషన్ గురించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎల్‌పురం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

నర్సీపట్నం : ఎల్ఐసీ ఏజెంట్లు కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. పాలసీలపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పాలసీదారులకు నష్టం జరుగుతుందన్నారు. ఏజెంట్ల పాలసీ కమిషన్ పెంచాలన్నారు. మినిమం పాలసీ రూ.2 లక్షలు చేయడం వల్ల పాలసీదారులకు ఇబ్బంది ఎదురవుతుందని ఏజెంట్లు పేర్కొన్నారు. పాలసీలు పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు పిలుపు

కె.కోటపాడు : ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందుతుందని మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి అన్నారు. కె.కోటపాడు గౌరీ కల్యాణ మండపంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు కొట్టాన ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయమూర్తి మాట్లాడుతూ బీజేపీ ఆదేశాల మేరకు గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. లక్ష్యాల మేరకు సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త పూర్తి చేయాలన్నారు. పార్టీ నాయకులు సన్యాసినాయుడు, అమ్మాజీ, దాలింనాయుడు, గంగునాయుడు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- సబ్ డివిజన్ పరిధిలో 82 సాగునీటి సంఘాలు
- 31న ఓటరు జాబితా
- వచ్చే నెల 21న తుది నోటిఫికేషన్



తాండవ జలాశయం

నర్సీపట్నం : రైతులు పంటల సాగుకు ఊతమిచ్చేందుకు చెరువులు, జలాశయాలు ఏర్పడ్డాయి. ఏ ప్రభుత్వాలు వచ్చిన జలాశయాలు, చెరువుల అభివృద్ధి, ఆధునికీకరణకు పెద్దపీట వేస్తున్నాయి. నిర్వహణ సక్రమంగా జరిగేందుకు అనువుగా సాగునీటి సంఘాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలతో సాగునీటి సంఘాలకు ఎన్నికలకు నిర్వహించేందుకు జలవనరులశాఖ అధికారులు సమాయుతం అవుతున్నారు. సంఘాల ద్వారా పంట కాలువల అభివృద్ధి, కాలువల వంతెనలు, తూములు ఇతరత్రా నిర్వహణ, మరమ్మతులు చేయించుకునే వెసులబాటు ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చనుంది. సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది.

77వేల ఎకరాల ఆయకట్టు

జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో 82 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మూడు మేజర్ జలాశయాలు, మిగిలినవి చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 77 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. నాతవరం మండలంలో ఒక్క మేజర్ తాండవ జలాశయం పరిధిలోనే 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తాండవ జలాశయం పరిధిలో 5 సెక్షన్‌లలో 28 సంఘాలు ఉన్నాయి. గొలుగొండ మండలంలో రావణాపల్లి, రావికమతం మండలం కల్యాణపులోవ మైనర్ జలాశయాలతో పాటు చెరువుల వారీగా సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

వచ్చే నెలలో ఎన్నికలు

ఐదేళ్ల తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నవంబర్ 23, 24, 25 తేదీల్లో ఎన్నికల పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సంఘాలు ఏర్పాటుతో జలాశయాలు, చెరువుల అభివృద్ధితో పాటు కాలువల్లో పూడిక తొలగింపుకు మోక్షం లభించనుంది. ఒక సంఘంలో అధ్యక్షుడు, ఆరుగురు సభ్యులు ఉంటారు.

మార్గదర్శకాల ప్రకారమే..

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రక్రియ పూర్తి చేయనున్నాం. తహసీల్దార్ నుంచి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను తీసుకున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల వివరాలను సేకరించాం. ఈ నెల 31న ఓటరు జాబితా పబ్లిష్ చేస్తాం, నవంబర్ 21న ఫైనల్ నోటిఫికేషన్ ఇస్తాం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

–బాల సూర్య, జలవనరుల శాఖ డీఈఈ, నర్సీపట్నం

నిత్యావసర ధరలను తగ్గించకుంటే ఉద్యమం

- సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం
- 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి : పెరిగిన నిత్యవసర ధరలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మండల కార్యదర్శి బి.టి. దొర అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యవసర ధరలు తగ్గించే వరకు నవంబర్ ఒకటో తేదీ నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జె.సన్నిబాబు, ఎర్రునాయుడు, షేక్ అప్పాజీ, సిహెచ్. దేముడు, కె. ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లాస్ ద్వారా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఇండస్ట్రియల్ అధికారి త్రివేణి

కె.కోటపాడు : ఉల్లాస్ పథకంతో నిరక్షరాస్యులకు ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ విద్యపై అవగాహన కల్పించనున్నట్టు వెలుగు ఇండస్ట్రియల్ అధికారి త్రివేణి అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో శుక్రవారం వెలుగు వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉల్లాస్ పథకం కోసం గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలని, గుర్తించిన వారికి వలంటీర్ల ద్వారా ఆర్థిక అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అప్పలరాజు, ఎంఈవో సత్యనారాయణ, పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

గాదిరాయి రెవెన్యూ గ్రామసభలో 16 దరఖాస్తులు



గాదిరాయి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రీసర్వే డీటీ గణపతిరావు



మేడిచర్ల రీసర్వే గ్రామసభలో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ భాగ్యవతి

మాడుగుల రూరల్ : మండలంలో గాదిరాయి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రీసర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన తప్పొప్పులు, సవరణలకు సంబంధించి 16 దరఖాస్తులు అందించినట్లు రీ సర్వే డీటీ ఎస్.గణపతి రావు తెలిపారు. ఈ గ్రామ సభకు సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, మండల దేశం పార్టీ అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావుతో పాటు, నాయకులు, రామునాయుడు, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నాతవరం : వల్సంపేట పంచాయతీ శివారు ఉలమల్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో జరిగిన భూ రీసర్వేలో ఎవరికైనా రైతుల భూముల్లో తప్పులుగా నమోదైతే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ కోరారు. ఈ సందర్భంగా రైతులు 35 మంది దరఖాస్తులు చేసుకున్నారు. నిబంధనల మేరకు వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్. రాజు, సర్వేయరు విజయకుమార్ వీఆర్వో బాబ్జి పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని బైలపూడిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 38 అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ వై.వి.ఎస్.ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ అర్జీలన్నీ రీ–సర్వేకి సంబంధించి వివిధ సమస్యలపై రైతులు అందించారన్నారు. 15 రోజుల్లో వీటిని పరిష్కరించనున్నట్టు తెలిపారు.

రొలుగుంట : పనసలపాడు గ్రామంలో రెవెన్యూ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 8 మంది దరఖాస్తులను అందించారు. 2019లో నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో ఆర్‌వోఆర్ కేసును వేసి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పలువురు గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : కాశీపురంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో తహసీల్దార్ పి. లక్ష్మీదేవి పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 14 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. గ్రామసభలో మండల సర్వేయర్ గోవిందరాజులు, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మీ, ఉప సర్పంచ్ సింహాచలంనాయుడు, వీఆర్‌వో కాసప్ప పాల్గొన్నారు.

మేడిచర్ల రెవెన్యూ గ్రామసభలో 19 అర్జీలు

కె.కోటపాడు : రీ సర్వే గ్రామసభలో సమస్యల పరిష్కారానికి అందించిన అర్జీలకు 15 రోజుల్లోగా పరిష్కారాన్ని చూపనున్నట్లు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు. మేడిచర్ల గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి 19 మంది అర్జీలను ఆమెకు అందించారు. అర్జీదారులు అందించిన సమస్యలను రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించిన వాటికి పరిష్కారాన్ని చూపే చర్యలు తీసుకోనున్నట్టు భాగ్యవతి పేర్కొన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులకు అందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం : వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతికత విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ ఏడీఏ టి.శ్రీదేవి రైతు సేవ కేంద్రం సిబ్బందికి సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్ర వారు నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతు ముంగిటకు తీసుకువెళ్ళాలన్నారు. రిసోర్స్ పర్సన్ చిరంజీవి మాట్లాడుతూ గ్రామాల్లో పొలంబడి సమర్థవంతంగా చెయ్యడం వల్ల కలిగే లాభాలను, ప్రస్తుతం వరిలో ఉన్న చీడపీడలు వాటి నివారణ చర్యలు, ఎలుకల నివారణ కోసం వివరించారు. డీఆర్సీ వ్యవసాయ అధికారి విజేత మాట్లాడుతూ వ్యవసాయశాఖలో ఉన్న వివిధ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవోలు, వీఏఏ, వీహెచ్ఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

గోతులమయంగా కెనాల్ గ్రావెల్ రోడ్డు



వర్షాలకు రాళ్లు తేలిన కెనాల్ మార్గం



కెనాల్ మార్గంలో గోతుల్లో నీరు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల గుండా ఉన్న రైవాడ కెనాల్ మార్గం వెంబడి గ్రావెల్ రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ఈ గొయ్యిల మార్గంలో ప్రయాణాల సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉగ్గినవలస, ఆర్.వై. అగ్రహారం, కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం, దాలివలస, రామచంద్రపురం, కె.కె. అగ్రహారం గ్రామాల గుండా ఈ కెనాల్ మార్గం పక్కగా గత 20 ఏళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ గ్రావెల్ రోడ్డు మార్గం గుండా సమీప గ్రామాలకు చెందిన వాహనదారులు రాకపోకలను చేస్తుంటారు. బరువుతో కూడిన వాహనాలు కుడా గ్రావెల్ రోడ్డు వెంబడి ప్రయాణాలు సాగించడం వల్ల పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసే సమయాల్లో ఈ గోతులు మరింతగా విస్తరిస్తున్నాయి. వర్షాలు పడే సందర్భంగా రోడ్డుపైభాగంలో గల గ్రావెల్ తొలగిపోవడంతో రోడ్డు అడుగు భాగంలో గల మెటల్ రాళ్లు బయటకు తేలుతున్నాయి. ఈ రాళ్లు తేలిన మార్గంగుండా ద్విచక్ర వాహన దారులు ప్రయాణాలు సాగించే సందర్భంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ అధ్వాన గ్రావెల్ రోడ్డు మార్గం గుండా ప్రయాణాలు చేయడం వల్ల వాహనాలు కుడా మరమ్మతులకు గురవుతున్నట్టు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లు తేలిన మార్గంతో పాటు అధ్వాన రోడ్డును అధికారులు గుర్తించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీడికాడ : మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10గంటలకు ఎంపీడీవో సమావేశ మందిరంలో ప్రారంభమౌతుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధల సభ్యులు హాజరు కావాలని కోరారు.

పశుగణన గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు తదితరులు



కె.జె.పురంలో పశుగణన కార్యక్రమం ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు



మామిడిపల్లిలో పశుగణన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ సూరినాయుడు



కె.కోటపాడులో పశుగణన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, ఏడీ దినేష్‌కుమార్



పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

మాడుగుల : ఈ నెల 25 వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి, 8వ తేదీ వరకు కొనసాగే పశుగణన గోడపత్రిక ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో గల అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పశుసంవర్థక శాఖ సిబ్బంది పశువులు, వివరాలు నమోదు చేసుకుంటారని వారికి సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో కేజేపురం పశువైద్యాధికారి మణి లక్ష్మణ్, ఎల్.ఎస్.ఎ సౌజన్య, స్థానిక నాయకులు ఉండూరు దేముడు, అద్దేపల్లి జగ్గారావు, రొబ్బా మహేష్, పుప్పాల రమేష్, మరువాడ ఈశ్వరరావు, ఎడ్ల హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం ఇవ్వండి

మాడుగుల రూరల్ : 21 వ అఖిల భారత పశుగణన కార్యక్రమం శుక్రవారం లాంఛనంగా ప్రారంభం అయింది. మేజర్ గ్రామ పంచాయితీ అయిన కేజేపురం గ్రామంలో సర్పంచ్ జామి రమణ బాబు, ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక పశువైద్యశాఖ సహాయకులు రమేష్ తౌలుత వాటర్ ట్యాంకు సమీపంలో గల కల్లం పాకలు వద్ద పశుగణన వివరాలు రైతులు నుంచి సేకరించారు. ఈ సందర్భంగా కె.జె.పురం పశువైద్యాధికారి మణిలక్ష్మణ్ మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖలో వివిధ రకాల పథకాలు రూపకల్పనకు, టీకాలు, అవసరమైన మందుల వివరాల కోసం ఈ కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాల సమగ్ర సమాచారం పశువైద్య సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ఆడారి వెంకట సూరిప్పారావు, రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పశు గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. శుక్రవారం మామిడిపల్లిలో సర్పంచ్ కర్రి సూరినాయుడు ఆధ్వర్యంలో పశుగణన గోడపత్రికను ఆవిష్కరించారు. పశువైద్యాధికారి జి. ప్రియాంక మాట్లాడుతూ పశుగణన కోసం వచ్చే సిబ్బందికి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇతరత్ర జీవాల సంఖ్య తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవరాపల్లి పశువైద్యాధికారి కె.మంజుషరాణి కాశీపురం, దేవరాపల్లిలో జరిగిన పశుగణన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మామిడిపల్లి ఉప సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు సింహాచలంనాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్‌లను ఆవిష్కరించిన ఎంపీపీ

కె.కోటపాడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుండి ప్రారంభమైన పశుగణన కార్యక్రమాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పశుగణనకు సంబంధించిన గోడపత్రికలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ చేతుల మీదుగా శుక్రవారం పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గల పశువైద్య సిబ్బందితో పాటు రైతు సేవా కేంద్రాల్లో గల పశువైద్య సహాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పశుగణనలో భాగంగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, పందులు, శునకాల గణనను చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ సమీరా తదితరులు పాల్గొన్నారు. పైడంపేటలో పశుగణన కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్, సర్పంచ్ రొంగలి రాఘవనాయుడు ప్రారంభించారు.

ఫిబ్రవరి వరకూ పశుగణన

మాకవరపాలెం: వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గ్రామాల్లో పశుగణన నిర్వహిస్తున్నట్టు మాకవరపాలెం, రాచపల్లి పశు వైద్యాధికారులు ప్రతాప్, అనిల్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రం వద్ద శుక్రవారం పశుగణను పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 28 వరకు పశుగణన నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో జరిగే ఈ గణనకు వచ్చే సిబ్బందికి సహకరించాలన్నారు. ముగ్గురు వైద్యులు సూపర్ వైజర్లుగాను, 10 మంది సిబ్బంది ఎన్యుమరేటర్లుగా వ్యవహరిస్తారన్నారు.

16 రకాల జీవాల గణన

నాతవరం : మండలంలో పశుగణన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాయకరావుపేట పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం శృంగవరం నాయుడుపాలెం గ్రామాల్లో పోస్టరు విడుదల చేసి పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పశుగణన కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పశుగణనలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లతో పాటు 16 రకాల జీవాలను గణన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయ్యపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

కె.కోటపాడు : మండలంలో చంద్రయ్యపేట గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను శుక్రవారం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 165 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలతో పాటు జాగ్రత్తలను వివరించారు.

కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల : జవహర్ నవోదయ కొమ్మాది విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మాడుగుల వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడారు.

9 వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలతో పాటు, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతూ ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తరగతి చదువున్న విద్యార్థులు 2010 మే 1 నుంచి 2012 జూలై 31 మధ్య జన్మించాలని, అలాగే 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2008 జూన్ 1, నుంచి 2010 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని అన్నారు. దరఖాస్తు చివరి గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందన్నారు.

పరీక్ష 2025 ఫిబ్రవరి, 8న జరగనుందన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నారు.

నర్సింగ్‌హోమ్‌కు ప్రారంభోత్సవం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న పద్మావతి

నర్సీపట్నం : నూతనంగా నిర్మించిన వి.వి.ఎస్. నర్సింగ్ హోమ్‌ను కౌన్సిలర్ చింతకాయల పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. ఆధునిక టెక్నాలజీతో ఆస్పత్రిని నిర్మించారు. ఎముకలు, డెంటల్ వైద్య సేవలు అందించేందుకు వీలుగా నిర్మించారు. డాక్టర్ వై.ఎల్.వి.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ వై.దివ్యతో కలిసి పద్మావతి ఆస్పత్రిని ప్రారంభించారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన ఆస్పత్రి భవనం



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం

మాడుగుల రూరల్: మాడుగుల 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్పు చేయడానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు సహకారంతో గతంలో ఈ ఆస్పత్రికి రూ.5.50 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో సంబంధిత గుత్తేదారు సుమారు 90 శాతం మేర పనులు పూర్తి చేసి, నిర్మాణ పనులు నిలుపుదల చేశారు. ప్రభుత్వం మారాక ఈ ఆస్పత్రిని ఇటీవల అనకాపల్లి ఎంపీ రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పరిశీలించారు. మరోసారి గుత్తేదారుతో మాట్లాడి పనులు జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు. భవన నిర్మాణం జరిగినప్పుడు ఇక్కడ పనిచేసే లేబర్ వుండేందుకు వేసిన షెడ్డును కూడా గుత్తేదారు తొలగించారు. ఈ భవనాన్ని సత్వరం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.